# ది లిటిల్ డిప్లమేట్

మా ఇంటిల్లిపాదీ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాం. టెలిఫోన్ మోగింది. మావారే ఎత్తుకున్నారు... "యస్... యస్... ఇది ద్వారకే! నేను సత్యభామని మాట్లాడుతున్నాను" అని ఠపీమని రిసీవరు పెట్టేసి "వెధవ కెవరికో ద్వారకా (హోటల్) కావాలిట" అన్నారు.

పిల్లలంతా గొల్లుమన్నారు. లల్లూకూడా ఆ జోక్ అర్థం అయినట్టు చాప మీదే దొర్లి దొర్లి నవ్వేడు. "పిచ్చి వెధవకి నా సెన్స్ ఆఫ్ హ్యూమరంతా వచ్చింది సుమీ" అన్నారు మావారు. ఒక్క సెన్స్ ఆఫ్ హ్యూమరే అన్న మాటేవిటి మావారి సుగుణాలు, దుర్గుణాలు, ఆకారం ఆవేశం అన్ని వచ్చేసేయి వీడికి ఒక్క మాటలో చెప్పాలంటే వాడు మా వారికి ఎటెస్టెడ్ ట్రూ కాపీ. ఎటొచ్చీ మా వారిలోనే కాకుండా మా ఇంటా వంటా కూడా లేని డిప్లమసీ వాడి ఎక్స్‌ట్రా క్వాలిఫికేషన్.

లల్లూ కడుపులో వున్నప్పుడు నాస్తికురాలైన నేను వాడికి మా వారి పోలికలు రాకూడదని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకున్నాను. మా అమ్మాయి నాకు కాంట్రాగా మొక్కు కుందని తరువాత తెలిసింది.

"నా అసలైన వారసుడు మా పెద్దమ్మాయి కడుపునే పుడతాడని మా ఆస్థాన జ్యోతిష్కుడు ఎప్పుడో చెప్పేడు. మీరెవరైనా నమ్మేరా?..." అన్నారు మావారు వాడ్ని ఎత్తుకుంటూ.

నయం! పక్కింటి అమ్మాయి కడుపున పుడతాడన్లేదు ఆ జ్యోతిష్యుడెవరో!

## 2

లల్లూ అంటే....

వెన్నెల గుత్తి.

రంగుల వాన

మెడిసన్ చదువుతున్న మా పెద్దమ్మాయి కొడుకు.

మాకు తెలిసినవాళ్ళలో సగంమంది మా వారిని గురువుగారంటారు. మిగతా సగం జడ్జీగారంటారు. లల్లూని మాత్రం అంతా మినీ జడ్జీగారంటారు. నాకు మాత్రం వాడు మెక్సీ మొగుడై పోయాడు మోటగా చెప్పాలంటే.

వాడికి పదినెల్లకే బండి "ర"తో సహా అన్ని అక్షరాలు పలకడం వచ్చేసింది, ఏడాది నిండేసరికి బూతులతో సహా భాష అంతా వచ్చేసింది. ఏడ్నార్థానికి తలలు మార్చడం వచ్చేసింది.

## 3

ఫస్టు తారీఖు నెలకోసారి వస్తుంది. హైదరాబాద్‌లో పనిచేస్తున్న మావారుకూడా మా దగ్గరికి అంటే గుంటూరు నెలకోసారే వస్తారు. కాని, నా బతుక్కి అప్పుడు ముప్పయ్యోతారీఖులా ఉంటుంది. ఆయన ఉన్న రెండు రోజులూ, ఆయనా, లల్లూ కలిసి సూరేకారం, పొటాష్ కలిసినట్లు ఇల్లంతా పేల్చేస్తారు. నామీద పోటీలు చెప్తే మావారు సంతోషిస్తారని వాడు కడుపులో ఉండగానే అభిమన్యుడిలా గ్రహించేసేడు. అంతే కాకుండా ఆయన్ని ఎలా ప్లీజ్ చెయ్యడమో ఆ వెధవకి తెలిసినంత బాగా మా కెవ్వరికీ తెలీదు.

ఓసారి....

మావారు వచ్చిన మర్నాడు ఉదయం...

పాల గ్లాసు పట్టుకొని "లల్లూ! లల్లూ!!" అని గొంతు చించుకున్నా వాడు పలకలేదు. రెండో పిలుపుకికాని వాడు పలక్కపోతే నాకు కాళ్ళూ చేతులూ వణకుతాయి అన్ని గదులూ అరుస్తూ వెతికాను. చివరికి ఆయన గదిలో చాపమీద ఆయన వశిష్టుడి లాగా, వీడు ధ్రువకుమారుడిలాగా కళ్లుమూసుక్కూర్చున్నారు.

"లల్లూ పాలు తాగుదుగానిరా" అతినెమ్మదిగా పిల్చేను. వాడు కళ్లు మూసుకునే ఎడంచెయ్యి పైకెత్తి "ష్! తపష్!" అన్నాడు. ఆయన కళ్ళు విప్పేరు. మొహం చేటంత చేసుకొని "దటీజ్ ఫైన్ మై బోయ్" అన్నారు.

విష్ణుమూర్తి ప్రత్యక్షమైనప్పటి ధృవుళ్ళా కళ్ళు విప్పేడు ఈ వెధవ.

ఈ తపష్ కథేమిటంటే – మూడేళ్ళ క్రిందటో, నాలుగేళ్ళ క్రిందటో ఒకనాడు మావారు హఠాత్తుగా వసు మహర్షినని డిక్లేర్ చేసేసి మెడిటేషన్ మొదలుపెట్టేరు. దానికి పులితోలూ ఏనుగుతోలూ వగైరాలేవీ కొన్లేదు గాని మెడ్రాస్ చాప ఒకటికొని యింట్లో పెట్టేరు. అతను ఊళ్ళో లేనప్పుడు దాని తాడు అరంగుళం తెగినా నా తాడు పూర్తిగా తెగినట్టే.

పాలఘట్టం పూర్తి అయేక నేనూ మావారూ షాపింగ్‌కి బైల్దేరేం.

"ఛీఫ్ మనతో వస్తాట్టా? రాట్టా?" అన్నారు మావారు. (వాడ్ని ఆయన "ఛీఫ్" అంటారు)

"వస్తాట్ట" కంచులా అరిచేడు కార్లోంచి.

"బజార్లో ఏం కొందాం?" కారులో అడిగేరు మావారు.

"ఈ అమ్మ బావులే. కొత్తమ్మని కొనుక్కుందాం" అన్నాడు నావేపు చూపించి. (వాడు నన్ను "అమ్మ" అంటాడు. మావార్ని "నాన్న" అంటాడు.)

"గ్రేట్ మెన్ థింక్ ఎలైక్ మై బోయ్" అంటున్న మావారి ఒళ్ళోకెక్కి కూర్చున్నాడు కారంతా ఖాళీగానే ఉన్నా.

ఆ రాత్రి...

"లల్లూ అన్నం పెడతాను రావే" అన్నాను వాడి అన్నం కలుపుతూ.

"నాన్నతో తింటాం" అన్నాడు మావారి సిగరెట్టుకి అగ్గిపుల్ల కొడుతూ ఆ తర్వాత ఆయన మెడచుట్టూ చేతులువేసి సిగరెట్టు పొగలో లీనమయిపోయేడు. ఆయనకి వాడి గోళ్ళు గుచ్చుకున్నట్టున్నాయి అయినా అప్పుడేం అనలేదు ఆయన.

భోజనం దగ్గర మాత్రం "సరేకాని యీ గోళ్ళేంవిఁటి? యూ మస్ట్ ఆల్వేజ్ బి నీట్. అమ్మని తియ్యమను... ఆవిడ వద్దులే వాళ్ళదసలే గోళ్ళు కొరికేసే వంశం...అన్నట్టు మీ తాత ఏం చేసేవాడో తెలుసా...?" ఎఫెక్టు కోసం ఆగేరు.

ఎఫెక్టు వచ్చింది.

తెలీదన్నాడు వీడు.

"అతను ఆకలేసినప్పుడూ, ఏం తోచనప్పుడూ కాలిగోళ్ళూ చేతిగోళ్ళూ కొరికేస్తూ ఉండేవాడు. తన స్టాకంతా ఐపోయిందనుకో..."

"వేళ్ళు తినేసేవాడా!" పూర్తి చేసేడు లల్లూ వెధవ.

"లవ్లీ జోక్. కాని అతనికంత సెన్స్ ఆఫ్ హ్యూమర్ లేదు. అప్పుడు చుట్టుపక్కల వాళ్ళని "బాబ్బాబు" మీ గోళ్ళు కొంచెం అప్పిస్తారా అని బతిమాలి వాళ్ళనికూడా కొరికేసేవాడు" లల్లూ నవ్వు ఆపుకోలేక ఉక్కిరిబిక్కిరి అయిపోయేడు.

"...అదీ వాళ్ళ వంశం. ఏవే అమ్మడూ యామ్ ఐ రాంగ్?" మా నాన్న ఏం కొరికేవారో కాని నాకు మాత్రం వాళ్ళద్దరి పీకలూ కొరికెయ్యాలనిపించింది.

"గుంట వెధవా! ఏవిటా నవ్వు? నోరు మూసుకొని అన్నం తినలేవూ!" మావారి మీది కోపంతో వాడ్ని కసిరేను.

"ఛీ...ఛీ... యాక్" అన్నాడు వెధవ.

"ఏవిటి? గోళ్ళు కొరకటమా? వాళ్ళ వంశవా?"

"అన్నీను"

"అంచేత అమ్మచేత ఒద్దుకాని మీ మమ్మీ చేత తీయించుకో" అన్నారాయన చెయ్యి కడుక్కుంటూ

వాడు వాడి అమ్మని నాన్నని మమ్మీ డాడీ అంటాడు.

## 4

మర్నాడు మా వారికి సెండాఫ్ ఇవ్వడానికి స్టేషన్‌కి వెళ్ళేం. ఆయన సిగరెట్లు కొనడానికి వెళ్ళేరు. మా అబ్బాయి అరుణ్ ఎవరో ఫ్రెండ్సుతో మాట్లాడుతున్నాడు. పక్కనే ఎవరో అమ్మాయిలు వెళ్తున్నారు.

"అరుణ మాంవయ్యా! కలర్! కలర్!!" అంటూ గట్టిగా అరుపులు ప్రారంభించేడు లల్లూ.

"నోర్ముయ్. రౌడీ వెధవా?" అని ఒక్కటి తగిల్చిచ్చింది మా చిన్నమ్మాయి.

"కలరంటే?" మా ఫ్రెండు అడిగింది ఆవిడది విశాఖపట్నం "అంటే అమ్మాయిలు" భాష్యం చెప్పేడు రౌడీ వెధవ.

మాకు తెలీకుండా మా వెనక నిల్చున్న మావారు వాడ్ని గర్వంగా తీసుకున్నారు నా దగ్గర్నించి.

"హైదరాబాద్ ఎప్పుడొస్తావ్?" ఆప్యాయంగా అడుగుతున్న అయన్ని ముద్దుపెట్టుకుంటూనే అంత ఆప్యాయంగానూ ఆయన జేబులోంచి యిన్ని నోట్లూ యింత చిల్లరా తీసి, యాభైరూపాయల నోటు మాత్రం నా హేండ్‌బాగ్‌లో పెట్టి మిగతాది మళ్ళీ ఆయన జేబులో పెట్టేసి "రేపు" అన్నాడు.

రైలు వెళ్ళిపోయింది.

"శంకర్ విలాస్" అన్నాడు. రిక్షాఎక్కుతూ అచ్చు మావారి స్టైయిల్లో.

"ఎందుకురా?"

"ఐస్‌క్రీం తింటాం" అన్నాడు నా బేగ్ తీసుకుంటూ.

## 5

మర్నాడు రాత్రి వాడూ, నేనూ డాబా మీద పడుకొని కథలు చెప్పుకుంటున్నాం వాడ్ని టెస్ట్ చేద్దామనిపించింది.

"లలుతల్లి, నేను నువ్వు హైదరాబాదు"

"అయిద్రాబాద్ యాక్" నానోరు మూసేసాడు చేత్తో.

"అక్కడ.....మంచి ఐస్‌క్రీములు ఇంకా..."

"ఒద్దు"

"అక్కడ నాన్నున్నారు..."

"నాన్న ఇంకా యాక్. కొత్త నాన్నని కొందాం"

## 6

మళ్ళీసారి మావార్ని రిసీవ్ చేసుకోడానికి వెళ్ళినప్పుడు ఇంకా మావారు పూర్తిగా రైలు దిగకుండానే నా దగ్గర్నుండి ఆయన మీదికి ఒక్క గెంతు గెంతేడు "నాన్నా బీరు మగ్గులు అమ్మ బద్దలుకొట్టింది" అంటూ.

ఆయన "మళ్ళీ కొంటాన్లే" అని వాడిని ఎత్తుకొని "ఏవిటిది నాన్నా ఈ గోళ్ళు? ఇంట్లో గోళ్ళుతినే వాళ్ళులేరా? లేకపోతే బరకడం కాంపిటేషనుకి వెళ్తున్నావా?" అన్నారు. అంతవరకు ప్రతిరోజూ వాడు

ముందూ, వెనక నెయిల్ కటర్ పట్టుకొని నేనూ రన్నింగ్ రేస్ చేస్తూనే ఉన్నాం.

వాడు నావేపు రెడీగాచూస్తూ "అమ్మ...నెయిల్ కట్టరంత లేవు వెధవ షోకులు...కొరికేస్తానురా...అంటుంది నాన్నా" అని వాడంటూంటే నాకు కళ్ళు ఒక్కసారి చీకట్లు కమ్మేయి, ఒళ్ళంతా ఒక్కసారి వణికింది.

లల్లూ ఆయనా ఫ్లాట్ ఫారం రెయిలూ అన్నీ గిరగిరా తిరిగిపోతున్నాయి.

ప్రాణానికి ప్రాణంగా పెంచుకుంటున్న నా లల్లూని ఎప్పుడైనా వాడి అమ్మా, నాన్న తీసుకుపోతే మేఁవెలా బతకడం.

కారుతున్న కన్నీరు తుడుచుకోవాలని కూడా తట్టలేదు నాకు.

*('ఆంధ్రజ్యోతి' దినపత్రిక, 19-5-1978.)*

* * *